

# సమస్యలు - పరిష్కారాలు

## - డా.యండమూరి వీరేంద్రనాథ్



సమస్య రాగానే మనం పరిష్కారం ఆలోచించటం మానేసి, విచారించటం ప్రారంభిస్తాం.

సముద్రం ఎంత పెద్దదైనా, నీళ్ళని లోపలికి రానివ్వకపోతే పడవ మునగదు. సమస్య ఎంత పెద్దదైనా, మనసులోకి రానివ్వకపోతే బాధ ఉండదు.

పాతికశాతం సమస్యలు పరిష్కారం లేనివి. పరిష్కారం లేని ఈ పాతిక శాతం గురించీ మనం జీవితంలో సగభాగం ఆలోచిస్తూ గడిపేస్తాం. ఇంకో యాభై శాతం సమస్యలు మనకి ఇతరుల వల్ల వచ్చేవి. అవి తీరాలంటే మారవలసింది వాళ్ళు. మనం కాదు. తాగుబోతు భర్త, దుబారా భార్య, గయ్యాళి అత్తగారు, చెడుదార్లో సంతానం వగైరా. వాళ్ళని మార్చటం ఎలా అని నిరర్థకంగా విచారిస్తూ మరో పాతిక శాతం కాలం గడిపేస్తాం. మిగిలిన పాతిక శాతం సమస్యల్నుంచి బయటపడాలంటే కఠినమైన నిర్ణయాలు అమలు జరపాలి. దురదృష్టవశాత్తూ ఇటువంటి సందర్భాల్లో మనం ఆలోచిస్తూ కూర్చుంటాము తప్ప నిర్ణయాలు తీసుకోము. తీసుకున్నా, అమలు జరపం.

...

ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో, ఆ నిర్ణయాన్ని ఎలా అమలు జరపాలో, ఏ సమస్యకి ఎలాంటి నిర్ణయం తీసుకుంటే సమస్య తాలూకు సాంద్రత తగ్గుతుందో ఆత్మీయంగా చెప్పే పుస్తకం.

బొమ్మలు: డా. జయదేవ్

## ముందు మాట

ఈ పుస్తకంలోని చాలా ప్రశ్నలు నవ్య, సాక్షి మొదలైన పత్రికలలో ప్రచురింపబడినవి. కొన్ని ప్రశ్నలు, సభల్లో ఉపన్యాసం అనంతరం శ్రోతలు అడిగినవి, మరి కొన్ని మిత్రుల మధ్య జరిగిన సంభాషణలో దొర్లినవి. కేవలం రెండు ప్రశ్నలు మాత్రం సమాధానం ఇవ్వటం కోసం సృష్టింపబడినవి.

కొన్ని సమాధానాల్లో కొన్ని కొటేషన్లు, చిన్న చిన్న కథలు, సంఘటనలు, సందర్భాలబట్టి గతంలో వ్రాసిన పుస్తకాల నుంచి పునరుద్ఘాటించబడినవి. వీలైనంత ఎక్కువ మంది పాఠకులకు విషయం చేరాలనే ఉదేశంతో వాటిల్ని తిరిగి ప్రస్తావించడం జరిగింది. వీటిని అంతకు ముందే చదివిన పాఠకులకు ఈ పునరుక్తి విషయమై క్షమాపణలు. ఇక్కడ, సమాధానాల కన్నా... ప్రశ్నలు ముఖ్యమని ఉద్దేశ్యం. ప్రస్తుతం యువత ఎలాంటి సమస్యలతో బాధపడుతోందన్న విషయం తెలియజెప్పటంకోసం, జవాబుల్ని పునరుక్తీకరించటం జరిగింది. అదే విధంగా, కాపీ రైట్ లేని ఇంటర్నెట్ బొమ్మలు కొన్ని వాడుకోవటం జరిగింది. ఆ అజ్ఞాత కళాకారులకి కృతజ్ఞతలు.

చివరిగా ఒక మాట.

ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి అభిప్రాయాలూ ఒకలా ఉండవు. ఇందులోని కొన్ని అభిప్రాయాలు కొంతమందికి నచ్చకపోవచ్చు. మరి కొందరికి కడుపులో దేవినట్టుగా కూడా అనిపించవచ్చు. ముందే చెప్పినట్టు ఎవరి అభిప్రాయాలు వారివి. దీనికోసం వాదనలు, ప్రతివాదనలు అనవసరం. వాదించేటప్పుడు మనం అవతలి వారిని అర్థం చేసుకోవటానికి వినం. మనం గెలవటానికి వీలుగా జవాబు ప్రిపేర్ చేసుకుంటూ వింటాం. ఇద్దరు రెచ్చిపోయి దీర్ఘంగా వాదించుకుంటున్నారంటే, అందులో ఒకరు మూగ, మరొకరు చెవిటి.

మూగ వాడికి అందరూ చెవిటి వాళ్ళలాగా కనబడతారు. చెవిటి వాడికి ప్రపంచమంతా మూగగా ఉన్నట్టు అనిపిస్తుంది. అర్థం – పర్థం లేని వాదనల పరమార్థం ఇదే.

వాదనలో గెలవటానికి అత్యుత్తమ సాధనం చిరునవ్వు. ఇతరులతో వచ్చే చాలా సమస్యల్ని 'నవ్వు' పరిష్కరిస్తుంది. 'మౌనం' సమస్యల్ని రాకుండా చేస్తుంది.

–రచయిత.

## ఫలవంతం – సమర్థవంతం

**శేఖర్, నల్లకుంట:**

**నేను ఒక కంపెనీలో ప్రొడక్షన్ ఇన్-చార్జీని. ఎంతో శ్రద్ధతో పని చేస్తాను. ఎంత చేసినా పైవారి నుంచి మెచ్చుకోలు లేదు. పని శ్రద్ధగా చెయ్యాలన్నది నా విశ్వాసం. దాన్ని 'ఆలస్యం' అంటారు మా వాళ్ళు. ఏమి చెయ్యాలో అర్థం కావటం లేదు.**

మీరు తయారు చేసే ప్రోడక్ట్ ఏమిటో చెప్పలేదు. ఒక పనిని 'ఫలవంతం'గా చేయటం వేరు, 'సమర్థవంతం'గా చేయటం వేరు. కిలో మైదాపిండితో ఒక గంటలో వంద కేకులు తయారు చేయటం ఫలవంతం (ఎఫిషియెన్సీ). ఒక రోజు పాటూ ఎవరూ చేయలేనంత అద్భుతంగా ఒక కేకు తయారు చేయటం సమర్థవంతం (ఎఫెక్టివ్‌నెస్). ఏ పని సమర్థవంతంగా చెయ్యాలి? దేన్ని ఫలవంతంగా చెయ్యాలి? అన్నది తెలుసుకోవటమే వృత్తిలోనూ, వ్యాపారంలోనూ విజయం. దురదృష్టవశాత్తూ మనం 'ఫలవంతంగా' చేయవలసిన పనిని సమర్థవంతంగానూ, 'సమర్థవంతంగా' చేయవలసిన పనిని ఫలవంతంగానూ చేసి పేరు పోగొట్టుకుంటూ ఉంటాం. ఈ ఇబ్బంది నాకూ ఉంది. ఒకసారి రచన పూర్తయ్యాక కర్త కర్మ క్రియల్ని మాటి మాటికీ అటూ ఇటూ మార్చటం, వ్రాసిన దాన్నే మళ్ళీ మళ్ళీ చెక్కటం, వగైరా..! అవసరం లేకపోయినా ఈ విధంగా మెరుగులు దిద్దేవారిని 'పెర్‌ఫెక్షనిస్టులు' అంటారు. కొన్ని వృత్తులకి ఇది పనికి రాదు. మీరు, మీ పై అధికారుల చెప్పుల్లో కాళ్ళు పెట్టి ఆలోచిస్తే, మీ పొరపాటు ఎక్కడుందో తెలుస్తుంది. దానికన్నా ముందు, మీది సమర్థవంతంగా పని చేసే మనస్తత్వమా? ఫలవంతంగా పనిచేసే అభిరుచా నిర్ణయించుకోండి.

## భక్తి – దేవుడు – నమ్మకం

**రాఘవ్, తిరుపతి:**

**నాదో చిత్రమైన సమస్య. అసలు దీన్ని సంస్య అనవచ్చో లేదో కూడా తెలీదు. తిరుమల కొండల పైకి వెళ్ళే దారి మొదట్లో మా ఇల్లు. ఎందరో వెళ్తూ ఉంటారు. అందులో ఫ్రాక్షనిస్టు రాజకీయ నాయకులూ, నేరస్తులూ, లంచగొండి అధికారులూ కనబడుతూ ఉంటారు. వీరిని రోజూ చూస్తూ ఉంటే దిగులుగా ఉంటోంది. దానికి నీకెందుకు దిగులు అనకండి. అర్థంచేసుకుని జవాబివ్వండి. వీరు తాము చేసే పనులకీ, భక్తికీ మధ్య ఏవిధంగా సమన్వయం చేసుకుంటారు?**

అది సమన్వయం కాదు. 'దేని దారి దానిదే' అన్న ఆత్మవంచన. హుండీలో ఓ కోటి వేస్తే, దేవుడు నన్ను చట్టం బారినుంచి రక్షిస్తాడు..' అన్న ఆత్మ సమర్థన ఇది. ఇటీవల కన్నడ సినిమాకి ఒక డైలాగు వ్రాసాను. 'తన వాదనలకు తాను డిఫెన్సు లాయరు, అవతలి వారి వాదనలకు ప్రాసిక్యూటరు' అని. నిజంగా భగవంతుడనే వాడుంటే, అతడు డిఫెన్సు లాయరూ కాదు. ప్రాసిక్యుటరూ కాదు. జడ్జి.

మంచివాళ్ళతో కలిసి ఉండు. చెడ్డవాళ్ళని వదిలిపెట్టమని అంటారు పెద్దలు. కాదు. అందరిలో మంచిని చూడు. చెడుని వదిలిపెట్టమన్నది కరెక్టు. ఎందుకంటే, ఈ ప్రపంచంలో ఎవరూ పెరఫెక్టు కాదు. ఈ దృక్పథమే మీ సమస్యకు పరిష్కారం.

**రమణ, చెన్నై:**

**జీవితంలో విజయం సాధించాలంటే అన్నిటికన్నా ప్రధమంగా కావలసింది ఏమిటి?**

జాన్ గాడ్ అనే వ్యక్తి ఒక బ్యాంకు స్థాపించాడు. ఇందులో అందరూ మెంబర్లు కావచ్చు. ప్రవేశం అందరికీ ఉచితం. మీరు కూడా పాల్గొనవచ్చు. మీ అకౌంట్లో ఎనభై ఆరు వేల నాలుగు వందలు జమ చేయబడుతుంది. ఎవరు ఎంత ఖర్చు పెడితే అంత గెలిచినట్టు. మరుసటి రోజుకి మీరు ఖర్చు పెట్టక మిగిలినదంతా తిరిగి వెనక్కి వెళ్లిపోతుంది. మరుసటి రోజు పొద్దున్న మళ్ళీ ఎనభై ఆరువేల నాలుగు వందలు జమ చేయబడతాయి. మీరు ఖర్చు పెట్టకపోతే అవి కూడా వృథా అయిపోతాయి. దీన్ని ఇంకొకరి పేరు మీద ట్రాన్స్ ఫర్ చేయటానికి వీలు ఉండదు.

ఈ రోజు 'అదా చేసి' తరువాత ఖర్చు పెట్టుకుంటానూ అంటే కుదరదు. ఎందుకంటే బ్యాంకు వారు ఎప్పుడైనా సరే '…నేటితో మీ అకౌంట్ క్లోజ్ చేస్తున్నాము' అని నోటీసు ఇవ్వకుండానే చెప్పవచ్చు. వారసత్వం ప్రసక్తే లేదు.

దీంట్లో మీరు మెంబర్ అయితే ఏం చేస్తారు? వీలైనంత వరకు ఖర్చు పెట్టటానికి ప్రయత్నిస్తారు. మరింత లాభదాయకంగా ఎలా ఖర్చుపెట్టాలా అని ఆలోచిస్తారు. మీకోసమే కాదు. మీ చుట్టూ ఉన్న వాళ్ళ కోసం, మీరు ప్రేమించే వాళ్ళ కోసం ఖర్చు పెడుతూనే ఉంటారు. ఎందుకంటే మరుసటి రోజు పొద్దున్నకి దాని విలువ సున్నా అయిపోతుంది కాబట్టి. అంతే కదా..!

నిజంగా ఇలాంటి బ్యాంకు ఉంది, నమ్మకం కలగటం లేదా? అవును, నిజంగానే ఉంది. ఈ బ్యాంకు సృష్టించింది అకౌంట్ లో వేసేది ప్రకృతి. రోజుకి ఎనభై ఆరు వేల నాలుగు వందల సెకండ్లు. మీరు వాడుకోని సమయం అంతా వృథా అయిపోయినట్టే. మరణంతో అకౌంటు క్లోజ్ అయిపోతుంది. మీరు ఎంత ధనవంతులో ఆలోచించండి. ఈ విధంగా ప్రతి క్షణాన్నీ ఆనందం కోసమో, ఆర్థిక లాభం కోసమో, ప్రేమ కోసమో ఖర్చు పెట్టినవాడు విజయం సాధించినట్టే. కాదంటారా?



జీవితంలో విజయం సాధించాలంటే అన్నిటికన్నా మొదటగా కావలసింది 'సమయం' విలువ గ్రహించటం. మీ ప్రశ్నకి అదే సమాధానం.

**సాయికుమార్:**

**నేను బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాను. నాకు పద్దెనిమిదేళ్లు ఉన్నప్పుడు మా అమ్మగారు చనిపోయారు. దాంతో నాన్న తాగుడికి బానిస అయిపోయారు. అప్పటికి పెద్దక్కకి మాత్రమే పెళ్లి అయ్యింది. చిన్నక్క, నేను ఉన్నాం. నాన్న బాధ చూడలేక రెండో పెళ్లి చేశాం. కానీ ఆ తర్వాత నాన్న చాలా మారిపోయారు. అక్కల్ని, నన్ను పట్టించుకోవడం మానేశారు. చిన్నక్క పెళ్లి కూడా అయిపోవడంతో నేను ఒంటరివాణ్ని అయిపోయాను. నాన్న నన్నసలు ప్రేమగా చూడటం లేదు. పైగా ఇంట్లోంచి వెళ్లిపో అంటున్నారు. నేనేం చేయాలి?**

ప్రేమని అడుక్కోవటంకన్నా దౌర్భాగ్యకరమైన స్థితి మరొకటి లేదు. ఈ సమాధానం ప్రచురింపబడేసరికి మీ గ్రాడ్యుయేషన్ అయిపోయి ఉంటుంది. ఉద్యోగం చూసుకుని వెళ్ళిపోండి. మీరు ప్రయోజకులు అయితే, మీ చుట్టూ ఉన్నవారు మిమ్మల్ని గౌరవిస్తారు. గౌరవంలో ప్రేమ ఉంటుంది.

| మానసిక శాంతికి మొదటి మెట్టు. |
|---|

**రఘువంశి, ఆత్మకూరు:**

**సమస్యలు అందరికి వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. కానీ నాది ఒక చిత్రమైన సమస్య. ఏదైనా ఒక సమస్య వచ్చినప్పుడు దాని గురించి విపరీతంగా ఆలోచిస్తాను. ఉదాహరణకి నా పర్సు పోయింది. అందులో ఉన్నది పది రూపాయలు మాత్రమే అనుకుందాం. కానీ దాని గురించి చాలా రోజులు ఆలోచిస్తాను. ఎంత విపరీతంగా ఆలోచిస్తానంటే రాత్రుళ్ళు నిద్ర కూడా పట్టదు. ఇంత నిర్లక్ష్యంగా పర్సు ఎందుకు పోగొట్టుకున్నానా అని బాధ పడతాను. అదే విధంగా, నన్ను ఎవరైనా ఒక మాట అని వెక్కిరించినా, దెబ్బలాడినా విపరీతమైన కోపం వస్తుంది. బాధ కూడా కలుగుతుంది. ఎన్నో రాత్రుళ్ళు వాటి గురించే ఆలోచిస్తూ ఉంటాను. ఏవేవిటో ఊహించుకుంటాను. నేను వాళ్ళని గెలిచినట్టు, వాళ్ళు నాకు క్షమాపణ చెప్పుకున్నట్టు, మళ్ళీ అంతలోనే వాళ్ళు అన్న మాటలకి కోపం, బాధ కలుగుతుంది. ఇలాంటి సమస్య అందరికి ఉంటుందా లేక నాకు మాత్రమేనా అన్నది అర్థం కావటం లేదు. మొన్న స్కూటర్ మీద వెళ్తూ ఎవరినో ఢీ కొట్టాను. పెద్ద గొడవ జరగ లేదు కానీ ఆ తరువాత**

**అతడు నా మీద పోలీస్ రిపోర్ట్ ఇస్తాడేమో అన్న భయంతో చాలా రాత్రులు నిద్ర పట్టలేదు. చిన్న చిన్న విషయాలకే ఏదో జరుగుతుందేమో అని బాధపడటం, భయపడటం నా సమస్య. దేనికేమైనా పరిష్కారం ఉందా?**

ఈ సమస్య మీకే కాదు. చాలా మందికి ఉంటుంది. చిన్న చిన్న విషయాలకే చాలా లోతుగా, చాలా కాలం ఆలోచించటం అనేది ఒక మానసిక బలహీనత. దీని గురించి నా సమాధానం కన్నా 'రాబర్ట్ ఆడమ్స్' పుస్తకం "సైలెన్స్ ఆఫ్ ది హార్ట్" చదవమని నా సలహా. ఈయన ఒక అమెరికన్ అద్వైత టీచర్. భారతదేశం వచ్చి రమణమహర్షితో స్ఫూర్తి పొంది, అమెరికాలో సత్-సంగ్ గ్రూప్ నిర్మించాడు. 'ప్రతి మనిషిలోనూ ఒక టీచర్ ఉంటాడని. తన 'యధార్థత'ని తాను తెలుసుకోవటమే పూర్ణత్వం' అనీ ఆడమ్స్ చెప్తారు. ఏ మతాన్ని సపోర్ట్ చేయకుండా కేవలం అద్వైత వేదాంతాన్ని వివరించే స్పిరిట్యుయల్ అవేకనింగ్ (అధ్యాత్మికత) తెలుసుకుంటే, మీ సమస్య చాలా వరకూ తగ్గిపోతుంది. "ఆయన మాటలలోనే" మీ సమస్యకి పరిష్కారాన్ని వివరించటానికి ప్రయత్నిస్తాను.

"...సరిగ్గా ఆలోచించ గలిగితే, నీ జీవితంలో జరిగే ప్రతి సంఘటనా నీ స్తిత ప్రజ్ఞతని ఒక మెట్టు పైకి తీసుకువెళ్ళటానికి ఉపయోగపడుతుంది. పొరపాటు అనేది లేదు. గతంలో జరిగింది, ప్రస్తుతం జరుగుతున్నది అంతా నీ ఎదుగుదల కోసమే, నీ అనుభవం కోసమే, నీ పరిణితి కోసమే.

నీ పట్ల జరుగుతున్నది ఏదైనా నీకు అసమ్మతిగా ఉంటే, అటువంటి ఆవేశానికి కారణం నీ మెదడు తాలూకు అసమ్మతి కాదు. నీ అహం తాలూకు ప్రతిస్పందన. జరుగుతున్న దానిని అనుభవిస్తున్న వాడిగా కాకుండా ప్రేక్షకుడిగా చూడు. ఘర్షణ పడకు, వాదించకు, అవతలి వారిని మార్చటానికి ప్రయత్నించకు. కేవలం చూస్తూ ఉండు..! ఏ మాత్రం ఉద్వేగపడకుండా చూస్తూ ఉంటే, నువ్వు సగం పరీక్ష నెగ్గినట్టే.

నీకు కోపం వచ్చినా, దుఃఖం వచ్చినా, ఆవేశం వచ్చినా, ఆవేదన పడినా... అవతలి వారిని హింసించో, ఘర్షించో అణచాలని చూసినా, నీవు నిరంతరం దాని గురించే ఆలోచిస్తూ ఉంటావు. అతడి తరువాత మరొకరు, ఒక ప్రమాదం తరువాత మరోక ప్రమాదం వస్తూనే..... వస్తూనే..... వస్తూనే ఉంటాయి. నీ జీవితమంతా యాక్షన్ మానేసి రియాక్షన్ లోనే గడిచిపోతుంది. వేదన, కోపము తప్ప అది మరింకేమి మిగల్చదు..."

ఆలోచించే కొద్దీ మరింత లోతైనా అర్థాన్ని ఇచ్చే అద్వైత సిద్ధాంతం ఇది. దీని గురించి ఒక చిన్న కథ:

జైన మతానికి పునాది 'అహింస'. చీమలకు కూడా హాని కలగించటానికి ఇష్టపడని జైనులు, కాలి క్రింద నలిగిపోతాయేమో అన్న సంశయంతో, నడిచే బాటను కూడా శుభ్రపరుస్తూ ముందుకు సాగే నిష్టాగరిష్టులు. అటువంటి జైన యువకులిద్దరిని భ్రష్టు పట్టించటానికి ఒక సాడిస్టు, వారిని విందుకు పిలిచి మాంసాహారం వాడ్డించి, వెళ్ళిపోయే ముందు వారికి ఆ విషయం చెప్పాడు. ఆ మతానికి కోపం నిషిద్ధం కనుక వారు అతడిని ఆశీర్వదించి అక్కడినుండి కదిలారు.



మరుసటి రోజు కలిసినప్పుడు, మొదటి యువకుడు రెండో వ్యక్తితో, 'రాత్రంతా ఈ విషయమై నిద్ర లేదు ' అన్నాడు అమితమైన వేదనతో.

'తెలియక చేసిన దానికి మనమేమి చేస్తాం? బాధ పడకు. మర్చిపో' అన్నాడు జైనుడు.రెండు రోజుల తరువాత దేవాలయం దగ్గర కలిసినప్పుడు మొదటి వ్యక్తి తిరిగి 'మనం తప్పు చేశామంటావా?' అన్నాడు సందేహంగా.

'మిత్రమా. నేను ఆ మరుసటి రోజే ఆ విషయాన్ని విసర్జించాను. నువ్వెందుకు దాన్ని ఇంకా కడుపులో పెట్టుకుని తిరుగుతున్నావు? ' అని ప్రశ్నిచాడు స్నేహితుడు.

## బట్టర్ ఫ్లై ఎఫెక్ట్

**లక్ష్మీ నారయణ, కాంచీపురం.**

**"డేగ రెక్కల చప్పుడు" పుస్తకంలో మీరు 'బట్టర్ ఫ్లై ఎఫెక్ట్', 'ఒంటె పై ఆఖరి గడ్డి పరక' అన్న పదాలు వాడారు. పూర్తి వివరణ ఇవ్వలేదు. అంటే ఏమిటి? రెండిటికి సంబంధం ఉందా?**

ఒక కుర్రవాడు ఇంటర్వ్యూకి వెళ్తూంటే బస్సు మిస్ అవుతుంది. నడుస్తూంటే దారిలో ఒక పర్సు కనపడుతుంది. అందులో నెంబరు చూసి ఫోన్ చేస్తాడు. అతడి నిజాయితీకి మెచ్చి యజమాని తన దగ్గర మొదట్లో ఉద్యోగమూ, ఆ పై భాగస్వామ్యమూ ఇస్తాడు. కుర్రవాడు కోటీశ్వరుడువుతాడు. ఏదో  మీటింగ్ లో ఓ అమ్మాయి పరిచయం అవుతుంది. ఇంట్లో వప్పుకోరు. ఈ లోపులో ఆమె మరొకర్ని వివాహం చేసుకుంటుంది. అతడు తాగుడుకి అలవాటు పడి నాశనం అయిపోతున్న సమయంలో ఒక స్వామి తటస్థపడతాడు. అతడి ప్రభావం వల్ల, ఆ యువకుడు అన్ని త్యజించి హిమాలయాలకు వెళ్ళిపోతాడు. ఆ రోజు బస్సు మిస్సవకుండా ఉంటే, ఈ రోజు అతడు హిమాలయాలలో ఉండేవాడు కాదు కదా.

'బట్టర్ ఫ్లై ఎఫెక్ట్' అంటే అది. ఎప్పుడో జరిగిన 'చిన్న' సంఘటన, తరువాత ఒక పెద్ద మార్పుకి దోహదపడటం ఈ చాటువు అర్థం. మన అందరి జీవితాల్లో ఇలాంటి చిన్న చిన్న సంఘటనల ప్రభావం ఉండే ఉంటుంది.

ఇక మీ రెండో సందేహం. ఒక వ్యక్తికి ఆర్థికంగా ఎన్నో కష్టాలు. క్రమక్రమంగా కృంగిపోయాడు. అయిన పళ్ళ బిగువున అదిమిపెట్టి బ్రతుకుతున్నాడు. ఒక రోజు కొడుకు ఫెయిల్ అయ్యాడని తెలిసింది. లేదా కూతురు ఎవరితోనో వెళ్ళిపోయిందని తెలిసింది. ఆ రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆఖరి గడ్డి పరక మొయ్యలేక ఒంటె క్రుంగి నేలకు కూలిపోవటం అంటే అది. అప్పటి వరకూ కొండ శిఖరం పై నిలబడిన మంచు, అడుగున చిన్న ముక్క కదలటంతో 'అవలంచి' గా మారటం కూడా దీనికి ఉదాహరణే.

బట్టర్–ఫ్లై –ఎఫెక్ట్ కి నూరు శాతం సరిపోయే భారత దేశచరిత్రకి సంబంధించి ఒక సంఘటన, డామెనిక్ లాపెర్రి వ్రాసిన 'ఫ్రీడం ఎట్ మిడ్ నైట్' అన్న పుస్తకంలో ఉన్నది.

ప్రేమ్ జి భాయ్ అనే వ్యక్తి, గుజరాత్ లో చేపల వ్యాపారస్తుడు. అందువల్ల అతడు (శాకాహార) కులం నుంచి వేలివేయ బడ్డాడు. వ్యాపారం మానేసి తిరిగి కులంలో చేరతానన్నా కులపెద్దలు వప్పుకోలేదు. దాంతో కోపగించిన ప్రేమ్ జి భాయ్ కొడుకు ఇస్లాం మతం పుచ్చుకున్నాడు. అతడి కొడుకే భారత విభజనకి కారణమైన మహమ్మద్ అలీ జిన్నా.

నెహ్రూ, జిన్నా సిద్దాంత రీత్యా బద్ధ శత్రువులు. ముస్లింలకి ప్రత్యేక దేశం కోసం పట్టుబట్టిన జిన్నా, భార్య మరణంతో లౌకిక విషయాలపై విరక్తి చెంది లండన్ వెళ్ళిపోయి దాదాపు ఒంటరి జీవితం గడపసాగాడు. ఆ సమయంలో ఒక ప్రైవేట్ డిన్నర్ పార్టీలో జవహర్ లాల్ నెహ్రూ "జిన్నా ఫినిష్ అయిపోయాడు" అంటూ చేసిన కామెంట్ గురిచి తెలిసి అగ్గి మీద గుగ్గిలమై ఇండియా తిరిగి వచ్చి ముస్లిం లీగ్ పార్టీని పునరుద్ధరించాడు. అది అనూహ్యంగా పెరిగి ఇండియా పార్టిషన్ కి దారి తీసింది.

విభజన మరో ఏడాదిలో జరుగుతుందనగా జిన్నాకి ఆ రోజుల్లో ప్రాణాంతకమైన టి.బి. వచ్చింది. అయన మరణం అంచున ఉన్నాడని తెలిసిన పటేల్ అనే హిందూ ఫ్యామిలి డాక్టరు, వృత్తి విలువలకి కట్టుబడి, ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. చెప్పి ఉంటే విభజన (పార్టిషన్) విషయం ఏదో రకంగా వాయిదా వేసేవారు గాంధీ, నెహ్రూలు. ఆ తరువాత ఉద్యమం దానంతట అదే చల్లారి పోయి ఉండేది.

జిన్నా తాతని హిందూ కుల పెద్దలు తిరిగి తమ కులంలో చేరటానికి ఒప్పుకున్నా, ఆ రోజు పార్టీలో నెహ్రూ ఆ మాట అనకపోయినా, జిన్నా ఆరోగ్యం సంగతి డాక్టరు ముందే వెల్లడి చేసినా, పాకిస్తాన్ ఉద్భవించేది కాదు. కొన్ని లక్షల మంది శరణార్థులు మరణించి ఉండేవారు కాదు. కాశ్మీరు సమస్య ఉండేది కాదు. బట్టర్–ఫ్లై –ఎఫెక్ట్ కి దీన్ని గొప్ప ఉదాహరణగా చరిత్రకారులు చెపుతారు. (సమాప్తం!!)